క్లుప్తంగా

నూతన స్పీకర్‌కు శుభాకాంక్షలు



ప్రసాద్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావును సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూనంనేని మాట్లాడుతూ.. మీరు గతంలో 2009లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాను కూడా ఎమ్మెల్యేగా ఉన్నానని మీరు పరిపూర్ణమైన స్పీకర్‌గా ఉండాలని ఆశిస్తున్నానన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సుజాత



కోరం కనకయ్యను అభినందిస్తున్న సుజాత

ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్య పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఇల్లెందు వైఎస్‌ఆర్‌టీపీ నాయకురాలు బానోతు సుజాత గురువారం హైదరాబాద్‌లో ఆయన క్వార్టర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఘన విజయం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో కలిసి పని చేస్తానని తెలిపారు.

జెడ్పీ చైర్మన్‌కు సన్మానం

సుజాతనగర్: జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావును మండల బీఆర్‌ఎస్ నాయకులు గురువారం సన్మానించారు. చంద్రశేఖర్‌రావు ఇటీవల జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన నేపథ్యంలో కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డెం తులసిరెడ్డి, మండె హనుమంతరావు, బత్తుల రమేష్, లింగం సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీతారాంపట్నం 220/132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఈనెల 16న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ లైన్ల మరమ్మత్తులు నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉండదని కొత్తగూడెం ఏడీఈ (ఆపరేషన్స్) పి.హేమచంద్రబాబు గురువారం తెలిపారు. కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నయా సర్కార్ న్యాయం చేసేనా?

- కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక జనం పరేషాన్



తహసీల్దార్ కార్యాలయం

ఇల్లెందురూరల్: స్వరాష్ట్రం సిద్ధించిన ప్రారంభంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించిన అప్పటి ప్రభుత్వం కొంతమందికి మంజూరు చేసింది. ఈ ప్రక్రియ 2017 వరకు కొనసాగింది. 2018 నుంచి రేషన్ కార్డుల దరఖాస్తులన్నీ చెత్తబుట్టలోకే వెళ్లాయి. కనీసం ఉన్న వాటికి మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఇవ్వకపోవడంతో కొత్తగా పెళ్లైనవారు, పుట్టిన పిల్లలకు రేషన్‌కార్డులలో చోటు లేకుండా పోయింది. దీంతో నాటి నుంచి రేషన్ కార్డులు అందక అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కొత్తగా కొలువు దీరిన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ రేషన్‌కార్డులకు అనుబంధంగా ఉండటంతో ప్రజలు కొత్త రేషన్ కార్డుల మంజూరు కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

రెండు వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్...

ఇల్లెందు పట్టణ, మండల పరిధిలో ప్రస్తుతం 22,859 రేషన్ కార్డులు ఉన్నాయి. 2018 నుంచి ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డుల కోసం 2,590 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయి. 2019 తరువాత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానించడంతో ప్రజలంతా ఎంతో ఆశగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ నేటికీ ఆ దరఖాస్తులు కనీసం పరిశీలనకు కూడా నోచుకోలేదు. ఇంతేకాకుండా రేషన్‌కార్డులలో మార్పులు, చేర్పులు అంటే 2018 తరువాత పుట్టిన పిల్లల పేర్ల నమోదు కోసం తల్లిదండ్రుల నుంచి వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. కానీ వీటిలో ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదు.

అందని రేషన్ బియ్యం...

ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రతినెల ఆరుకిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తోంది. కరోనా ప్రభావంతో మూడేళ్లుగా ఉచితంగా పంపిణీ చేసింది. గడిచిన ఆరు నెలలుగా ఉచితం రద్దు చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ చేస్తోంది. కొత్త రేషన్‌కార్డులు అందక, కార్డులలో మార్పులు, చేర్పులు లేక చాలామంది ఉచిత, సబ్సిడీ సౌకర్యాలను పొందలేకపోయారు.

అన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికం...

కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రేషన్ కార్డు ప్రాతిపదికగా అమలు చేసే అవకావం ఉందని ప్రచారం జోరందుకుంది. ఇప్పటి వరకు మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్య శ్రీ పేరుతో రెండు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. వీటిలో మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. మరో పక్షం రోజుల్లో మహాలక్ష్మి కార్డు జారీ చేస్తామని ప్రకటించింది. అయితే మహాలక్ష్మి కార్డుల జారీ ప్రక్రియలో తెల్లరేషన్ కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకునే అవకాశాలు మెండుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే వాస్తవమైతే తాము మహాలక్ష్మి పథకానికి దూరమవుతామన్న ఆందోళన అన్నివర్గాల ప్రజల్లో వ్యక్తమవుతోంది. మరో కీలక సంక్షేమ పథకమైన రాజీవ్ ఆరోగ్యశ్రీని పరిమితిని కొత్త ప్రభుత్వం రూ.10 లక్షల వరకు పెంచెంది. ఈ పథకం వర్తించాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి.

కొత్త ప్రభుత్వంపై ఆశలు...

ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం అమలు చేయాలన్నా ప్రామాణికంగా తీసుకునే తొలి ప్రాధాన్యం రేషన్ కార్డు. అంతటి కీలకమైన రేషన్ కార్డు దరి చేరక ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమై ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదిలా ఉండగా కొత్త రేషన్ కార్డులను త్వరలో మంజూరు చేస్తామని ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించడంతో ప్రజల్లో కొత్త రేషన్ కార్డుపై ఆశలు రేకెత్తాయి. అంతేకాకుండా కొత్త ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో అత్యధికం రేషన్ కార్డులకు అనుబంధంగా ఉండే ఆవకాశం ఉండటంతో ప్రజలంతా కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు జారీ చేస్తారో అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

పెళ్లై మూడేళ్లయినా..



నాకు వివాహమై మూడేళ్లు అవుతోంది. మాకు ప్రస్తుతం ఒక అబ్బాయి. రెండు సంవత్సరాల క్రితమే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నాం. కానీ నేటికీ ఆ దరఖాస్తులు పరిశీలనకు కూడా నోచుకోలేదు. ఫలితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేక పోతున్నాం. కొత్త ప్రభుత్వమైనా మా ఇబ్బందులు గుర్తించి కొత్త కార్డులు జారీ చేయాలి. – పూనెం రవీందర్, విజయలక్ష్మీనగర్

ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నాం..



నాకు వివాహమై ఎనిమిదేళ్లు. అప్పటి వరకు ఉమ్మడి కుటుంబంలో ఉన్న మేము రేషన్ కార్డులో పేరు తొలగించుకొని కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాం. నాటి నుంచి దరఖాస్తు పరిశీలనకు కూడా నోచుకోలేదు. మాకు ప్రస్తుతం ఇద్దరు పిల్లలు ఉన్నారు. రేషన్ కార్డు అందక అప్పటి నుంచి సంక్షేమ పథకాలకు దూరమయ్యాం. – ధనసరి కోటయ్య, పోచారంతండా

రూ.27 వేల కోట్ల బకాయిలు రప్పిస్తాం..



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణికి రావాల్సిన రూ.27 వేల కోట్ల బకాయిలను రప్పిస్తామని, కార్మికుల భవిష్యత్ కోసం సంస్థను కాపాడేందుకై బీఎంఎస్ నడుం బిగించిందని, ఏబీకేఎంఎస్ జాతీయ నాయకుడు మాధవనాయక్ అన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపులో సుంకర రామ్‌చందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రకృతికి విరుద్ధంగా వందల అడుగుల లోతుల్లో పనిచేసి బొగ్గును ఉత్పత్తి చేసి విద్యుత్ కేంద్రాలకు తరలిస్తుంటే తరలించిన బొగ్గుకు సంబంధించిన రూ.వేల కోట్ల బకాయిలను వసూలు చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తూ సింగరేణిపై ఆర్థిక భారం మోపారని ఆరోపించారు. ఇది చాలదన్నట్లు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న సింగరేణి జైపూర్ పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని రాష్ట్ర ప్రభుత్వ గ్రిడ్‌కు తరలించటం సరైంది కాదన్నారు. సింగరేణిని సిక్ పరిశ్రమ దిశగా నెడుతున్న యాజమాన్య పెద్దలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొగిలిపాక రవి, పవన్‌కుమార్, నరేంద్రబాబు, కాసర్ల మోహన్, అల్లిప్రకాశ్, వీఎస్ మూర్తి, రాజమౌళి పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు ఇవ్వండి

జూలూరుపాడు: అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, కొత్త రేషన్ కార్డుల కోసం నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తారని ప్రజలు బలంగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో ప్రజలు మీసేవా కేంద్రాల్లో రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకుంటే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి, సర్పంచ్ సావిత్రి

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి గురువారం ప్రారంభించారు. రూ.3 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ గలిగె సావిత్రితో కలిసి భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవరకొండ కిరణ్, వార్డు సభ్యులు శీరంశెట్టి రామారావు, దుద్దుకూరి స్వరూప, కాంగ్రెస్ నాయకులు నున్నా రంగారావు, నర్వనేని పుల్లారావు, యల్లంకి పుల్లయ్య, మాచినేని సత్యనారాయణ, సాయిన్ని రమేష్, చంటి పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన హెచ్‌పీసీఎల్ అధికారుల ఆదేశాల మేరకు గ్యాస్ వినియోగదారులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు పొందేందుకు ఈకేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల సంస్థ హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ఇంటికి వచ్చి ఈకేవైసీ చేస్తారని, లేని పక్షంలో కార్యాలయానికి వచ్చి చేయించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి గ్యాస్ పైపు మార్చుకోవాలని, దానిని నవభారత్ గ్యాస్ ఆఫీస్ నందు కొనుగోలు చేయాలన్నారు. గ్యాస్ తనిఖీ చార్జీలు కూడా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అనుకోకుండా గ్యాస్ లీకేజీ వల్ల ఏమైనా ప్రమాదాలు జరిగినచో కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

ఘనంగా మహాపడి పూజ



హోమగుండం వద్ద మాలధారులు

టేకులపల్లి: కొత్తతండా(పి) గ్రామంలో బాలు గురుస్వామి, అయ్యప్ప భక్త బృందం, ఆంజనేయ భక్త బృందం ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్వామిచే శరణం అయ్యప్ప... నామస్మరణ మార్మోగింది. టేకులపల్లి మండలానికి చెందిన సుమారు ఐదు వందల మంది అయ్యప్ప మాలధారులు హాజరయ్యారు. హోమగుండం, నగరసంకీర్తన, మహాపడి పూజ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు అనుగోజు నటరాజ్, గుండా నరసింహారావు, బోడ మంగీలాల్, తోటకూరి జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న దయాళ్

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు పాఠశాలలో చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని రామవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రామవరం క్లస్టర్ నోడల్ ఆఫీసర్ దయాళ్ సూచించారు. గురువారం పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరి భవిష్యత్‌కు వారే నిర్ణేతలని, శిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. పదో తరగతి అనంతరం ఉన్నత చదువులు, ఆ తరువాత ఉద్యోగ అవకాశాలపై వివరించారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, భరత్, నరసింహా, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లపై దుష్ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న సీతాలక్ష్మి

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లపై దుష్ప్రచారం మానుకోవాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలు, ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలు నచ్చి సీపీఐ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన కౌన్సిలర్లు, నాయకులు తిరిగి సీపీఐలో చేరుతున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అసత్య ప్రచారం చేస్తున్న వారు తీరు మార్చుకోకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌన్సిలర్లు కె.ధర్మరాజు, వై.శ్రీనివాసరెడ్డి, అంబుల వేణుగోపాల్, బి.విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, మాచర్ల రాజకుమారి, కె.పరమేష్ యాదవ్, వేముల ప్రసాద్‌బాబు, ఎంఏ రజాక్, మోరె రమేష్, ఎండీ యూసుఫ్, మాచర్ల శ్రీనివాస్, బ్యాండ్ దుర్గ, పిడుగు శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

కోఆపరేటివ్ సొసైటీలో డివిడెండ్ అందజేత



డివిడెండ్ అందజేస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ ఎస్‌అండ్‌పీసీ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో గురువారం సొసైటీ సభ్యులకు చెందిన షేర్ క్యాపిటల్ రూ.12 లక్షలను జీఎం సెక్యూరిటీ దీక్షితులకు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం సెక్యూరిటీ మాట్లాడుతూ... సొసైటీ సభ్యులకు వారు తీసుకున్న లోన్‌పై వచ్చిన డివిడెండ్‌ను అందరికీ పంచటం ఆనవాయితీ అన్నారు. సొసైటీలో 245 మంది సభ్యులకు వారు తీసుకున్న లోన్‌ను బట్టి వచ్చిన ఆదాయాన్ని వారికి పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బండెల విజేందర్, టీబీజీకేఎస్ కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షుడు, సొసైటీ ముఖ్య సలహాదారుడు ముప్పాని సోమిరెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకటరమణ, వైస్ ప్రసిడెంట్ మోరే రమేష్‌కుమార్, పాపట్ల నాగిరెడ్డి, సెక్రటరీ మీసాల శ్రీనివాస్, ట్రెజరర్ కే.లక్ష్మీనర్సమ్మ, గడ్డం రేష్మ తదితరులు పాల్గొన్నారు.

18న ఆటో జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సర్వీస్‌కు వ్యతిరేకంగా ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న నల్ల బ్యాడ్జిలతో నిరసన ర్యాలీని నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఉచిత బస్సు సర్వీసు పథకం కారణంగా తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్లతో సంబంధం లేకుండా ఆటో డ్రైవర్లంతా ఈ నిరసన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎల్.రమేష్, మాటేటి వెంకట్, శేఖర్, గుండ్ల రాజు, చందు, దోర్నాల రాజు, కుమార్, రాజ్‌కుమార్, సుధీర్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, మర్రి కృష్ణ పాల్గొన్నారు.

నాసిరకంగా ఇంకుడు గుంతల నిర్మాణం



రామవరం కమ్యూనిటీ హాల్‌లో నాణ్యతా లోపంతో నిర్మిస్తున్న ఇంకుడు గుంత

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం కమ్యూనిటీ హాల్‌లో ఇంకుడు గుంత పనుల్లో నాణ్యత లోపిస్తోందని కార్మికులు చెబుతున్నారు. ఏరియాలోని అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రతీ ఇంకుడు గుంతకు సుమారు రూ.45 వేలతో పనులు చేపట్టారు. అయితే పనులను పర్యవేక్షించాల్సిన ఏరియా సివిల్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నాడు. నాణ్యత లేని సిమెంట్ బ్లాకులు వాడుతున్నారు. ఈ నిర్మాణంలో ఆదిలోనే పగుళ్లు వచ్చాయి. ఇలా నిర్మాణం చేస్తే తొందరగా శిథిలావస్థకు చేరుకునే ప్రమాదముందని కార్మికులు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా ఇటీవల ఒక కాంట్రాక్టర్ అంతర్గత రోడ్ల నిర్మాణంలో సిమెంటుకు బదులుగా యాష్‌ను, నాణ్యత లేని ఇసుకను వాడినట్లు కార్మికులు చర్చించుకుంటున్నారు. ఏరియాలో జరిగే అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



కేక్ కట్ చేస్తున్న సాబీర్ పాషా, పాస్టర్లు

పాల్వంచ: ప్రజలు సన్మార్గంలో నడిచేందుకు యేసు క్రీస్తు బోధనలు దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. మండలంలోని సురారం గ్రామంలో జీవజల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ.. క్షమాగుణం, శాంతి, కరుణ, సహనం, ప్రేమతో జీవించిన క్రీస్తు జీవన గమనం అందరికీ ఆచరణీయమన్నారు. దాతృత్వం, త్యాగం మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలన్నారు. క్రిస్మస్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతర కేక్ కటింగ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, మండల కార్యదర్శి పూర్ణచందర్‌రావు, ఎండీ పాషా, లింగేశ్వర్, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు



ఇల్లెందు: పొంగులేటిని కలిసిన కోరం కనకయ్య



జూలూరుపాడు: మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



సుజాతనగర్: మొక్క అందజేస్తున్న సీతారాములు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సెక్రటేరియట్‌లో గురువారం కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిశారు. నూతనంగా మంత్రి పదవి బాధ్యతల చేపట్టినందుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తూము చౌదరి, ఆళ్లమురళి, నాగేంద్ర త్రివేది, శంకర్‌నాయక్, పెద్దన్న, సత్యనారాయణరెడ్డి, చీకటి కార్తీక్, అంతోటిపాల్ ఉన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): గురువారం ప్రారంభమైన అసెంబ్లీ తొలి సమావేశానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, (ఐఎన్‌పీ) ఇన్ఫర్మేషన్ మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, కాంగ్రెస్ నాయకులు ఆకునూరి కనకరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛ అందజేసి, శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ.. ఈనెల 27న సింగరేణిలో జరగనున్న సింగరేణి ఎన్నికల ప్రణాళికల గురించి చర్చించారు. సానుకూలంగా స్పందించిన పొంగులేటి, అసెంబ్లీ సమావేశాలు అయిన తరువాత ఎన్నికలు అయ్యేంత వరకు కోల్‌బెల్ట్ ప్రాంతంలోనే ఉంటానని చెప్పినట్లు తెలిపారు.

సుజాతనగర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు గురువారం కలిసి అభినందనలు తెలియజేశారు. మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ కరీంపాషా, సైదుబాబు, సత్తార్, బొల్లం ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: హైదరాబాద్‌లోని సచివాలయంలో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గురువారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పాల్వంచ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, జాలే జానకిరెడ్డి, బాలినేని నాగేశ్వరరావు, కొండెం వెంకన్న పాల్గొన్నారు.

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సచివాలయంలో తమకు కేటాయించిన చాంబర్స్‌లోకి గురువారం ప్రవేశించి, బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వారిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మిట్టపల్లి నాగి ఉన్నారు.

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సచివాలయంలో తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. పొంగులేటిని కలిసిన వారిలో గార్ల జెడ్పీటీసీ జాటోతు ఝాన్సీ తదితరులు ఉన్నారు.



సింగరేణి(కొత్తగూడెం): మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి బొకే అందజేస్తున్న కనకరాజు



పాల్వంచ: పొంగులేటికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు



కొత్తగూడెంరూరల్: మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు